క్లుప్తంగా

ఎంపీ రఘునందన్ పరామర్శ


వెంకటపతితో మాట్లాడుతున్న ఎంపీ

దుబ్బాక: భూంపల్లి అక్బర్‌పేట మండలం ఎనగుర్తికి చెందిన రియల్ ఎస్టేట్ వ్యాపారి వెంకటపతిని హైదరాబాద్‌లోని కేర్ ఆసుపత్రిలో ఎంపీ రఘునందన్‌రావు శనివారం పరామర్శించారు. వెంకటపతి కొన్ని రోజుల నుంచి చికిత్స పొందుతున్నారు. విషయం తెలుసుకొన్న ఎంపీ ఆయనను పరామర్శించి ఆరోగ్య పరిస్థితి అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట బీజేపీ దుబ్బాక మున్సిపల్ అధ్యక్షుడు కిష్టంగారి సుభాష్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

ఎమ్మెల్యే పల్లా..

మద్దూరు(హుస్నాబాద్): మండలంలోని లద్నూరు గ్రామానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ కార్యకర్త సోగల కిష్టయ్య అకస్మాత్తుగా మరణించాడు. విషయం తెలుసుకున్న జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి మృతుడు కుటుంబాని పరామర్శించి మృతదేహంపై పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన వెంట మద్దూరు, దూళ్మిట్ట మండల నాయకులు సంతోష్‌కుమార్, యాదగిరి, మాజీ వైస్ ఎంపీపీ సుమల, పీఏసీఎస్ వైస్ చైర్మన్ రాజిరెడ్డి, మాజీ ఎంపీటీసీ సమ్మయ్య, మాజీ సర్పంచ్ సుదర్శన్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

కొమ్మూరి..



చేర్యాల(సిద్దిపేట): మండల పరిధిలోని నాగపురి గ్రామానికి చెందిన గొట్టం నర్సింహారెడ్డి ఇటీవల మృతి చెందారు. స్థానిక నాయకుల ద్వారా విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే, డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్ రెడ్డి శనివారం నర్సింహారెడ్డి ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. ఆయన వెంట కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కొమ్ము రవి, జిల్లా నాయకుడు పూర్మ ఆగంరెడ్డి, స్థానిక నాయకులు ఉన్నారు.

'పొద్దుతిరుగుడు' పరిశీలన


పంటను పరిశీలిస్తున్న ఏఓ

తొగుట(దుబ్బాక): మండలంలోని ఘనపూర్‌లో సాగైన పొద్దుతిరుగుడు పంటను ఏఓ మోహన్ శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్టెమ్ గిర్‌డిల్ అనే పురుగు పంటకు నష్టం చేస్తోందని, దాని నివారణ కోసం లండసైహాలోత్రిణ్, థియోమెతిక్స్(అలికా సింజెంటా) అనే మందును ఎకరాకు 80ఎంఎల్, 200లీటర్ల నీటిలో కలిపి పువ్వుకాడ వెనక భాగంలో పడేవిధంగా స్ప్రే చేయాలన్నారు. పూతదశలో ఉన్నపంటలో పువ్వు విచ్చుకున్న పది రోజులకు మందు స్ప్రే చేయాలని సూచించారు.

వేగవంతం చేయండి..


పనులను పరిశీలిస్తున్న రాజమౌళి

గజ్వేల్: స్థానిక బస్టాండ్ నిర్మాణం పనులను వేగంగా పూర్తిచేయాలని మున్సిపల్ చైర్మన్ ఎన్సీ రాజమౌళి సూచించారు. శనివారం ఆయన పనులు జరుగుతున్న తీరును పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయని, ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఆశ్రయం లేక విద్యార్థులు, ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారని, వేగవంతంగా పనులు పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. ఆయన వెంట మున్సిపల్ కౌన్సిలర్ గోపాల్‌రెడ్డి ఉన్నారు.

దివ్యాంగుల గుర్తింపు కోసమే 'సదరం'

గ్రామీణాభివృద్ధిశాఖ అధికారి జయదేవ్ ఆర్య

సిద్దిపేటరూరల్: దివ్యాంగుల గుర్తింపు కోసం నిర్వహిస్తున్న సదరం శిబిరాన్ని అర్హులంతా సద్వినియోగం చేసుకోవాలని జిల్లా గ్రామీణాభివృద్ధిశాఖ అధికారి జయదేవ్ ఆర్య శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జనవరి 2న కంటిచూపు, 9, 16, 30న ఆర్థోపెడిక్, జనరల్ పరీక్షలు, 23న మానసిక వైకల్యం, వినికిడి సమస్యలున్న వారికి పరీక్షలు చేయనున్నట్లు తెలిపారు. హాజరు కావాలనుకొనే దివ్యాంగులు మీసేవ కేంద్రాల్లో స్లాటు బుక్ చేసుకుని కేటాయించిన తేదీలలో హాజరు కావాలని సూచించారు. కోమటిచెరువు దగ్గరలోని ప్రభుత్వ ఆస్పత్రిలో ఈ శిబిరం నిర్వహించనున్నామని, ఉదయం 9గంటలకు హాజరుకావాలని తెలిపారు.

క్రీడాప్రాంగణాల కనుమరుగు

గ్రామీణ ప్రాంతాల్లో క్రీడాకారులను ప్రోత్సహించేందుకు గత ప్రభుత్వం పట్టణాలతోపాటు ప్రతి పంచాయతీ పరిధిలోను క్రీడా ప్రాంగణాలు ఏర్పాటు చేసింది. ప్రభుత్వ భూములున్నచోటల్లా మైదానాలు సిద్ధం చేశారు. కానీ నిర్వహణ లేకపోవడంతో పిచ్చి మొక్కలు, పొదలతో నిండిపోయాయి. అవి పూర్తిగా కనుమరుగయ్యే పరిస్థితి నెలకొంది.

- పెరిగిన పిచ్చిమొక్కలు, పొదలు
- రూపురేఖలు కోల్పోతున్న మైదానాలు
- అధికారుల నిర్వహణ లోపం
- నిరాశ చెందుతున్న ఆటగాళ్లు



అర్జునపట్ల క్రీడా ప్రాంగణంలో పెరిగిన పిచ్చి మొక్కలు, గడ్డి


నీరుచేరి బురదమయంగా దొమ్మాట మైదానం


బోర్డు కూడా కనపడని చేర్యాల ప్లే గ్రౌండ్

చేర్యాల(సిద్దిపేట): క్రీడాకారులను ప్రోత్సహించేందుకు ఎంతో ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసినా.. పట్టించుకొనే నాథుడు కరువవ్వడంతో ఆటలు ఆడే పరిస్థితి లేకుండా పోయింది. గతేడాది నుంచి గ్రామాల్లో సర్పంచ్‌లు లేకపోవడంతో పంచాయతీ కార్యదర్శులు, ప్రత్యేక అధికారుల పట్టింపు కరువైందని గ్రామస్తులు, క్రీడాకారులు ఆరోపిస్తున్నారు.

కోట్ల రూపాయలు నిరుపయోగం

ఈ క్రీడా ప్రాంగణాల ఏర్పాటు కోసం గత ప్రభుత్వం కోట్ల రూపాయలు ఖర్చుచేసింది. ప్రతీ పంచాయతీలో సుమారు 50వేల నుంచి రూ.లక్ష వరకు ఖర్చు చేసింది. పట్టణాల్లో అయితే కొంత అదనపు నిధులు వెచ్చించింది.

ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదు



యువతపై ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదు. క్రీడలపై ఆసక్తి ఉన్నప్పటికీ క్రీడా స్థలాలు లేక ఇబ్బంది పడుతున్నారు. గత ప్రభుత్వం పట్టణాలు, గ్రామాల్లో నెలకొల్పిన క్రీడా ప్రాంగణాలు అలంకార ప్రాయంగా మారాయి. వెంటనే ప్రభుత్వం స్పందించి చర్యలు తీసుకోవాలి.

– రామగల్ల నరేశ్, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సమితి సభ్యుడు

వినియోగంలోకి తీసుకొస్తాం..



మండల పరిధిలో రెండు గ్రామాలు తప్ప అన్ని గ్రామాల్లో క్రీడా ప్రాంగణాలు ఉన్నాయి. వెంటనే వాటిని పరిశీలించి, పరికరాల గురించి తెలుసుకుంటాం. అపరిశుభ్రంగా ఉన్న చోట్ల శుభ్రం చేయిస్తాం. త్వరలోనే వినియోగంలోకి తీసుకు వచ్చేలా కృషి చేస్తాం.

– మహబూబ్ అలీ, ఎంపీడీఓ, చేర్యాల

జింక్, భాస్వరం కలిపి వేయొద్దు

- ఏఈఓ నాగార్జున


వరినాట్లపై అవగాహన కల్పిస్తున్న నాగార్జున

తొగుట(దుబ్బాక): వరిసాగుచేసే క్రమంలో చివరి దుక్కిలో జింక్, భాస్వరం కలిపి వేయవద్దని ఏఈఓ నాగార్జున రైతులకు సూచించారు. మండల పరిధిలోని పెద్ద మాసాన్‌పల్లి రైతు పన్యాల భాస్కర్‌రెడ్డి వ్యవసాయ క్షేత్రంలో శనివారం ఆయన రైతులకు వరినాట్లపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చలి ప్రభావం అధికంగా ఉన్నందున వరిలో జింక్ పోషకం లోపిస్తుందన్నారు. జింక్, భాస్వరం కలిపి వేయడం వల్ల అవి భూమిలో కలిసి జింక్‌సల్ఫేట్‌గా మారుతుందని, దీంతో మొక్కకు కావసినంత జింక్, భాస్వరం అందకుండా పోతాయని చెప్పారు. నాటువేసిన ఐదు రోజులలోపు ఎకరాకు 20కిలోల జింక్‌సల్ఫేట్‌ను వేసుకోవాలని, లేకుంటే 15రోజుల లోపు చిలేటెడ్ జింక్ స్ప్రే చేసుకోవాలని సూచించారు. అలాగే నాటువేసే క్రమంలో 40 నుంచి 44మొక్కలు నాటుకుంటే దిగుబడి అధికంగా వస్తుందన్నారు.

పంట వ్యర్థాల కాల్చివేతపై అవగాహన


రైతులకు అవగాహన కల్పిస్తున్న విద్యార్థులు

హుస్నాబాద్: స్థానిక కేరళ హైస్కూల్ విద్యార్థులు నాగారం గ్రామంలో పంట వ్యర్థాల కాల్చివేతపై శనివారం రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వరికొయ్యలు కాలిస్తే వాతావరణ కాలుష్యం జరుగుతుందని వివరించారు. వానపాములు, భూ సారం పెరగడానికి ఉపయోగపడే సూక్ష్మ జీవులు, బాక్టీరియా నశిస్తాయని తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ బుర్ర రాజేందర్, కరస్పాండెంట్ శైలేందర్, ఉపాధ్యాయులు, రైతులు పాల్గొన్నారు.

ఆయిల్‌పామ్‌తో అధిక లాభాలు


మాట్లాడుతున్న ఉద్యానశాఖ అధికారి బాలాజీ

బెజ్జంకి(సిద్దిపేట): ఆయిల్‌పామ్ సాగుతో అధిక లాభాలు పొందవచ్చని ఉద్యాన అధికారి బాలాజీ చెప్పారు. స్థానిక రైతువేదికలో శనివారం ఆయిల్ పామ్ సాగుపై రైతులకు అవగాహన కార్యక్రమంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆయిల్‌పామ్ సాగుతో దీర్ఘ కాలికంగా లాభాలు పొదవచ్చన్నారు. ప్రస్తుతం టన్నుకు రూ.20,400 ధర పలుకుతోందని చెప్పారు. కార్యక్రమంలో ఏఓ సంతోష్, ఏఈఓలు రేణుక, శ్వేత, తేజస్వి, భరత్ కుమార్, విజయ్, రాములు, రైతులు పాల్గొన్నారు.

స్వశక్తి మహిళలు ఆర్థిక అభివృద్ధి సాధించాలి


మహిళలతో కలిసి కేక్ కట్ చేస్తున్న చందు

హుస్నాబాద్‌రూరల్: స్వశక్తి మహిళలు ప్రభుత్వ రుణాలను సద్వినియోగం చేసుకొని ఆర్థిక అభివృద్ధి సాధించాలని మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బంక చందు సూచించారు. శనివారం హుస్నాబాద్ మండల సమాఖ్య సమావేశానిక హాజరై మాట్లాడారు. మహిళలను లక్షాధికారులను చేయడానికి ప్రభుత్వం బ్యాంకుల ద్వారా రుణాలు ఇస్తుందని, వాటితో స్వయం ఉపాధి పొందాలని సూచించారు. మహిళ సంఘాలకు ప్రభుత్వం సోలార్ యూనిట్స్, ఎలక్ట్రికల్ బస్సులను అందించబోతుందని చెప్పారు. కుటీర పరిశ్రమలను నెలకొల్పి నలుగురికి పని కల్పించాలని, పరిశ్రమలకు కావల్సిన రుణాలను ప్రభుత్వం అందిస్తుందని చెప్పారు. అనంతరం న్యూ ఇయర్ వేడుకలను జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం భిక్షపతి, సీసీలు రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక రాజనీతజ్ఞుడు మన్మోహన్‌సింగ్


పూలమాలలు వేస్తున్న లింగమూర్తి తదితరులు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): దేశం తీవ్ర ఆర్థిక సంక్షోభంలో ఉన్నప్పుడు ఆర్థిక పరిస్థితిని పునరుద్ధరించిన గొప్ప ఆర్థికవేత్త మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ అని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ లింగమూర్తి కొనియాడారు. గ్రంథాలయంలో శనివారం మన్మోహన్‌సింగ్ చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో గ్రంథపాలకుడు కె.రాజు, దాసరి రాజు తదితరులు పాల్గొన్నారు.

పేదల బతుకులు రోడ్డుపై పడ్డాయి

- మళ్లీ మన టైం వస్తుంది
- ట్యాక్సీ డ్రైవర్లతో హరీశ్‌రావు


ట్యాక్సీ డ్రైవర్లతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే హరీశ్

సిద్దిపేటజోన్: కాంగ్రెస్ ప్రభుత్వం వస్తే మార్పు వస్తుందన్నారు.. మార్పు అంటే గిదేనా..? అని ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. శనివారం సిద్దిపేటలో ట్యాక్సీ డ్రైవర్లతో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజల ఉసురుపోసుకుంటుందని మండిపడ్డారు. పేదల బతుకులు రోడ్డున పడ్డాయి. అసెంబ్లీలో గట్టిగా కొట్లాడినా ప్రయోజనం లేకుండా పోతుంది. హామీలపై నిలదీస్తే సీఎం నుంచి సమాధానం రావడం లేదు. ఒక్కటి పనికి వచ్చే ముచ్చట చెప్పలేదు అని ఆగ్రహం వ్యక్తం చేశారు. గిరాకీలు లేక ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నామని ట్యాక్సీ డ్రైవర్లు వాపోయారు. ఒకప్పుడు రోజు 6 కిరాయిలు వచ్చేవని, ప్రస్తుతం రెండు కూడా రావడం లేదన్నారు. పోలీసుల చలాన్లు కూడా తమకు ఇబ్బందిగా మారిందన్నారు. తమ కుటుంబం నడవడమే కష్టంగా ఉందన్నారు. రైతుబంధు కూడా ఆగిపోయింది. భూముల ధరలు పడిపోయి, మార్కెట్ కళ తప్పింది. మాకు కిరాయిలు లేకుండా పోయాయని వారు చెప్పారు. బీఆర్ఎస్ ప్రభుత్వం పోవడంతో సిద్దిపేట ఏదో కోల్పోయినట్టుగా ఉందన్నారు. మన టైం వస్తుంది. బాధ పడొద్దని హరీశ్ పేర్కొన్నారు. అసెంబ్లీలో గట్టిగా కొట్లాడి సిద్దిపేట పేరును కాపాడిన. సీఎం కేసు వేస్తా.. జైల్లో వేస్తా.. తొక్కేస్తా అంటున్నాడని చెప్పారు. అయితే.. ఇలానే కొట్లాడండి.. మేము మీకు మద్దతుగా ఉంటామని డ్రైవర్లు చెప్పారు.

న్యాయం చేయాలని కలెక్టర్‌కు వినతి

గజ్వేల్: గజ్వేల్–ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని కోటమైసమ్మ రోడ్డు విస్తరణలో ఇళ్లు కోల్పోయిన బాధితులకు న్యాయం చేయాలని కలెక్టర్ మనుచౌదరికి బీఆర్ఎస్ నాయకుడు కల్యాణ్ నర్సింగరావుతోపాటు తొమ్మిదో వార్డుకు చెందిన పలువురు శనివారం వినతిపత్రం అందజేశారు. అభివృద్ధి పేరిట ఇళ్లను కూల్చేసిన అధికారులు బాధితులకు డబుల్ బెడ్రూమ్ ఇవ్వడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని వాపోయారు. ఇటీవల నాగుబాయి అనే మహిళ ఆశ్రయంలేక అనారోగ్యానికి గురై చనిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. తమ విజ్ఞప్తిపై స్పందించిన కలెక్టర్ చర్యల కోసం అధికారులను ఆదేశించారని నర్సంగరావు తెలిపారు.

'ఆర్థిక సహాయం' అమలు చేయాలి

- డీబీఎఫ్ రాష్ట్ర నాయకులు

జగదేవ్‌పూర్(గజ్వేల్)/గజ్వేల్‌రూరల్: భూమిలేని ఉపాధిహామీ రైతుకూలీలకు యేడాదికి రూ.12వేల ఆర్థిక సహాయం అందజేసే పథకాన్ని అమలుచేయాలని కోరుతూ శనివారం జగదేవ్‌పూర్ ఎంపీడీఓ యాదగిరికి, గజ్వేల్ ఐఓసీలో ఆర్డీఓ చంద్రకళకు డీబీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి దాసరి ఏగొండస్వామి, జిల్లా ప్రధాన కార్యదర్శి వేణు ఆధ్వర్యంలో శనివారం వినతిపత్రాలు అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ పథకం అమలు కోసం రాష్ట్ర బడ్జెట్‌లో రూ.12 వందల కోట్లను కేటాయించారని, కూలీల నుంచి దరఖాస్తులు స్వీకరించాలని కోరారు. ఎలాంటి నిబంధనలు లేకుండా భూమిలేని పేదలందరికీ ఈ పథకం వర్తింపజేయాలని డిమాండ్ చేశారు.

భూములు ఆక్రమిస్తే చర్యలు తప్పవు

- దుకాణాలను తొలగించిన అధికారులు


షాపులను తొలగిస్తున్న అధికారులు

కోహెడ(హుస్నాబాద్): కోహెడ–హుస్నాబాద్ రోడ్డు ఎన్‌టీఆర్ కాలనీ సమీపంలోని ప్రభుత్వ భూమిలో పలువురు ఏర్పాటు చేసిన దుకాణాలను రెవెన్యూ, పంచాయతీ అధికారులు శనివారం తొలగించారు. ఈ సందర్భంగా ఆర్ఐ సురేందర్ మాట్లాడుతూ ఎన్‌టీఆర్ కాలనీకి చెందిన జాలిగం భరత్ ఫిర్యాదు మేరకు పరిశీలించామన్నారు. ఎటువంటి అనుమతులు లేకుండా దుకాణాలు ఏర్పాటు చేసినట్లు గుర్తించామని చెప్పారు. ఈ స్థలంలో పేదలకు ఇళ్ల స్థలాలు కేటాయించగా మిగిలిన భూమిలో దుకాణాలను ఏర్పాటు చేశారన్నారు. ప్రభుత్వ స్థలాలను ఆక్రమిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అలాగే భారత్ పెట్రోల్ బంక్‌లో ఏర్పాటు చేసిన మూత్రశాలలు, మరుగుదొడ్ల నుంచి మురుగునీరు బాడుగుల చెర్వు రహదారిపైకి చేరుతోందని, తక్షణమే చర్యలు తీసుకోవాలని జీపీ కారోబార్ అనిల్‌ను ఆదేశించారు.

సబ్సిడీపై మొక్కజొన్న విత్తనాలు


రికార్డులను పరిశీలిస్తున్న మల్లేశం

మిరుదొడ్డి(దుబ్బాక)/అక్కన్నపేట(హుస్నాబాద్)/జగదేవ్‌పూర్(గజ్వేల్): : సబ్సిడీపై మొక్కజొన్న విత్తనాలను అందజేస్తున్నామని, రైతులు సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి మల్లేశం చెప్పారు. మిరుదొడ్డిలోని పలు విత్తన, ఎరువుల దుకాణాలను శనివారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులు, విత్తనాల సంచులు, ఎరువుల బస్తాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయశాఖ తరఫున బయోసీడ్ 9544 రకం 5కిలోల విత్తనాల సంచి రూ.1,375కు గాను రూ.500సబ్సిడీతో రూ.875కే అందజేస్తున్నామన్నారు. ప్రస్తుత సీజన్‌లో ఆరుతడి కింద మక్క సాగుచేసే రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. జాతీయ ఆహార భద్రత మిషన్ పథకంలో భాగంగా సబ్సిడీపై హైబ్రీడ్ రకం మొక్కజొన్న విత్తనాలు అందజేస్తున్నామని అక్కన్నపేట ఏఈఓలు కరంటోతు శ్రీలత, రాధ; జగదేవ్‌పూర్ ఏడీఏ అనిల్‌కుమార్ తెలిపారు. విత్తనాలు కావలసిన రైతులు పట్టాదార్ పాస్‌బుక్, ఆధార్ కార్డు జిరాక్స్ తీసుకొని రైతుల వేదికల్లో ఏఈఓలను కలవాలని సూచించారు.

అనుమతులు లేకుండానే..

- పాఠశాలలో టేకు చెట్లు నరికివేత


నరికేసిన చెట్లు

మద్దూరు(హుస్నాబాద్): దూళ్మిట్ట మండలంలోని బైరాన్‌పల్లి గ్రామంలోని ప్రభుత్వ పాఠశాల ఆవరణలో పెంచిన టేకు చెట్లను గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ బండి శ్రీనివాస్ గౌడ్, విద్యాశాఖ అధికారులు ఎలాంటి అనుమతులు లేకుండానే నరికివేశారు. దీంతో గ్రామానికి పలు చెందిన పలువురు అటవీశాఖ అధికారులకు ఫిర్యాదు చేయడంతో ఫారెస్టు బీట్ అధికారి రాయుడు శనివారం చెట్లను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ.. గ్రామానికి చెందిన శ్రీనివాస్ ఎలాంటి అనుమతులు లేకుండానే మూడు టేకు చెట్లను నరికివేశారని, కేసు నమోదు చేసి జరిమానా విధించనున్నట్లు తెలిపారు. ఈ విషయంపై ఇన్‌చార్జి ఎంఈఓ, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మీనాంజనేయులును వివరణకోరగా తమకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండానే శ్రీనివాస్ చెట్లను నరికివేశారని చెప్పారు.

సంక్షిప్త వార్తలు

◆ **తహసీల్దార్ కార్యాలయం తనిఖీ**

మద్దూరు(హుస్నాబాద్): దూళ్మిట్ట తహసీల్దార్ కార్యాలయాన్ని హుస్నాబాద్ ఆర్డీఓ రామ్మూర్తి శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న సమస్యలను సత్వరమే పరిష్కరించాలని సూచించారు. అనంతరం రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో తహసీల్దార్ మధుసూదన్, ఆర్ఐ రవీందర్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

◆ **బండి సంజయ్‌ని కలిసిన గిరిజన నేతలు**

అక్కన్నపేట(హుస్నాబాద్): కేంద్ర మంత్రి బండి సంజయ్‌ను కరీంనగర్‌లో తన క్యాంప్ కార్యాలయంలో మండలానికి చెందిన బీజేపీ గిరిజన మోర్చా నాయకులు లావ్యడి రైనా నాయక్, భానోతు అనిల్ నాయక్ శనివారం మర్యాద పూర్వకంగా కలిశారు. మండల పరిధిలోని వివిధ తండాలలో రోడ్డు సౌకర్యం, హైమాక్స్ లైట్లు, సీసీ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కోరినట్లు తెలిపారు. దానికి మంత్రి సానుకూలంగా స్పందించినట్లు చెప్పారు.

◆ **జాతీయ జెండాల అవనతం**

మిరుదొడ్డి(దుబ్బాక): మాజీ ప్రధాని, దివంగత మన్మోహన్ సింగ్ కన్నుమూసిన సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం వారం రోజులు సంతాప దినాలుగా ప్రకటించినందున మండలంతో పాటు అక్బర్‌పేట–భూంపల్లి మండల కేంద్రాల్లో అన్ని ప్రభుత్వ కార్యాలయాల వద్ద జాతీయ జెండాలను అవనతం చేశారు.

◆ **ముగ్గురు పిల్లల నిబంధన వద్దు**

జగదేవ్‌పూర్(గజ్వేల్): స్థానిక సంస్థల ఎన్నికల్లో ముగ్గురు పిల్లల నిబంధన తొలగించాలని కోరుతూ మండలంలోని కాంగ్రెస్ నాయకులు దాసు, నర్సింహులు ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్నను శనివారం కలిసి వినతిపత్రం అందించారు. సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకపోవాలని కోరారు. ఎమ్మెల్సీ స్పందించి సీఎం దృష్టికి తీసుకపోతామని హామీ ఇచ్చారు.

◆ **అంగన్‌వాడీలకు ఒక్కరోజు శిక్షణ**

మద్దూరు(హుస్నాబాద్): పిల్లల్లో అవగాహనశక్తి పెంపొందించేందుకు అంగన్‌వాడీ సహాయకులు కృషిచేయాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పుష్పలత సూచించారు. స్థానిక అంగన్‌వాడీ సెంటర్‌లో రిలయన్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈసీసీ ప్రాజెక్టులో భాగంగా శనివారం అంగన్‌వాడీ సహాయకులకు ఒక్కరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. పరిసరాలు, వ్యక్తిగత పరిశుభ్రత, పిల్లల ఎదుగుదలపై సీఆర్‌పీలు వివరించారు. కార్యక్రమంలో సీఆర్‌పీలు భార్గవి, శ్వేత తదితరులు పాల్గొన్నారు.

◆ **విద్యార్థులకు టాలెంట్ టెస్టు**

సిద్దిపేటకమాన్: ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు గణిత విభాగంలో హ్యాపీ ఆర్గనైజేషన్ సంస్థ ఆధ్వర్యంలో టాలెంట్ టెస్టు నిర్వహించనున్నట్లు సంస్థ నిర్వాహకులు తెలిపారు. సిద్దిపేట ప్రెస్‌క్లబ్‌లో శనివారం వారు మాట్లాడుతూ విద్యార్థులలో నైపుణ్యాన్ని వెలికితీయడానికి, భవిష్యత్‌లో పోటీపరీక్షల్లో రాణించడానికి ఈ టెస్టులు నిర్వహిస్తున్నామని చెప్పారు. విద్యార్థులకు ఉచితంగా పుస్తకాలు పంపిణీ చేశామని చెప్పారు. శ్రీకాంత్, రమేశ్ పాల్గొన్నారు.

◆ **పెండింగ్ వేతనాలు చెల్లించాలి**

గజ్వేల్‌రూరల్: పెండింగ్‌లో ఉన్న వేతనాలను వెంటనే చెల్లించాలని పశువైద్య సంచార వాహన(1962) సిబ్బంది డిమాండ్ చేశారు. శనివారం వారు గజ్వేల్‌లో మాట్లాడుతూ నాలుగు నెలలుగా వేతనాలు చెల్లించకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు.

◆ **దాతల సహకారం అభినందనీయం**

నంగునూరు(సిద్దిపేట): దాతలు అందిస్తున్న సహకారం అభినందనీయమని ఎంఈఓ దేశిరెడ్డి అన్నారు. రంగదాంపల్లికి చెందిన పారిశ్రామిక వేత్త వంగ రాజేశ్వర్‌రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకొని శనివారం రూ.20 వేలతో 40మంది విద్యార్థులకు క్రీడా దుస్తులు అందజేశారు. మాజీ సర్పంచ్ భిక్షపతినాయక్, హెచ్‌ఎం చంద్రం, లక్ష్మణ్‌నాయక్, అనిల్, లక్ష్మి, భాస్కర్, సంతోష్, శివ పాల్గొన్నారు.

అభివృద్ధి పనులను వేగవంతం చేయాలి: చంద్రం



ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): సిద్దిపేటలో ఆగిన అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తిచేయడానికిగా చొరవ చూపాలని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుడు వేం నరేందర్‌రెడ్డిని కోరినట్లు పీసీసీ సభ్యుడు దరిపల్లి చంద్రం తెలిపారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు నరేందర్‌రెడ్డి జన్మదినం సందర్భంగా హైదరాబాద్‌లో మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపానన్నారు. జిల్లా అభివృద్ధికి నిధులు కేటాయించి అండగా ఉండాలని నరేందర్‌రెడ్డిని కోరగా అందుకు సానుకూలంగా స్పందించారని చెప్పారు.